తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## స్టేట్ రౌండప్
STATE ROUNDUP



## గెలిపిస్తే ప్రజల గొంతుకగా మారుతా

### ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

**వరంగల్,మే25:** తనను గెలిపిస్తే ప్రజల సమస్యలపై పోరాడతానని నల్గొండ- వరంగల్- ఖమ్మం ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డి అన్నారు. ప్రజల గొంతుకగా ప్రశ్నిస్తానని తెలిపారు. వరంగల్ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం నాడు రాకేశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. విద్యావంతులు, మేధావులు భవిష్యత్ గురించి ఆలోచించి తీర్పు ఇవ్వాలని కోరారు. తెలంగాణ ప్రజలకు



మంచి కోసం మేధావులు ఆలోచించి ఓటు వేయాలన్నారు. దేశంలో చట్టసభలకు గొప్ప గొప్ప మేధావులు వెళ్లారని, ఇప్పుడు ద్రోహులు, బ్లాక్ మెయిలర్లు పోటీ చేస్తున్నారని రాకేశ్ రెడ్డి అన్నారు. ఉద్యోగులు ఎలాంటి బెదిరింపులు లేకుండా పనిచేయాలని, ప్రశాంతంగా ఎవరి వ్యాపారాలు వారు చేసుకోవాలని.., దీనికి కోసం ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపాలని కోరారు. ప్రజల తరఫున ప్రశ్నించే వారెవరు? ప్రభుత్వానికి తొత్తులుగా మారెవారెవరు అనేది గ్రహించాలని సూచించారు. తాను రైతు బిడ్డనని, బిట్స్ పిలానీలో గోల్డ్ మెడలిస్టునని చెప్పారు. అమెరికాలో ఏడేండ్లు ఉద్యోగం చేశానని, పుట్టినగడ్డ రుణం తీర్చుకునేందుకు సేవ చేసేందుకు ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. అధికారం కోసం ఎప్పుడూ పాకులాడలేదని, ఒక ఆశయంతో వచ్చినట్లు చెప్పారు. బీజేపీలో ఉన్న కార్యకర్తలు కూడా తనతో పని చేశారని అన్నారు. తాను ఏ పార్టీలో పనిచేసినా ప్రజల పక్షాన ప్రజాసమస్యల కోసం పోరాడుతానని చెప్పారు. సమాజ భవిష్యత్ కోసం ఏ నాయకుడిని ఎన్నుకోవాలనేది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆలోచించాలని కోరారు.

## అబద్దాల గ్యారెంటీతో అధికారంలోకి కాంగ్రెస్



### కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ ఒకే తాను ముక్కలు
### వారి కారణంగానే ఎమ్మెల్సీ ఉప ఎన్నిక
### బిజెపికే ఓటేస్తేనే న్యాయం జరుగుతుందన్న రామచంద్రరావు

**ఖమ్మం,మే25:** అబద్దాల గ్యారెంటీతో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వచ్చిందని మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఏమి చేసిందో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అదే చేస్తుందన్నారు. ఈ రెండు పార్టీలు కూడా చట్టసభల్లో ప్రతిపక్షం ఉండకూడదని కుట్ర పన్నాయని మిగతా 2లో..

## తెలంగాణలో మళ్లీ పెరిగిన ఎండలు

### ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకుపైగా నమోదు
### వర్షాలు తగ్గుముఖంతో మారిన వాతావరణం



**హైదరాబాద్,మే25:**
తెలంగాణలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పాటు..ఎండలు దంచి కొడుతున్నాయి. మళ్లీ ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. ఈ క్రమంలో రాబోయే ఐదురోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. శనివారం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఆదివారం పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వివరించింది. గడిచిన 24గంటల్లో వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్ కర్నూల్ జిల్లాల్లో మోస్తరు వర్షాపాతం నమోదైంది. పలు జిల్లాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. ఇక నైరుతి రుతుపవనాలు నైరుతి బంగాళాఖాతంలో మరికొన్ని ప్రాంతాలు, ఆగ్నేయ బంగాళాఖాతంలో మిగతా ప్రాంతాలకు విస్తరించాయని అమరావతి వాతావరణ విభాగం పేర్కొంది. రాబోయే 24గంటల్లో నైరుతి బంగాళాఖాతం, మధ్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలు, ఈశాన్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల మీదుగా ముందుకు సాగేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని పేర్కొంది. ఈస్ట్ సెంట్రల్ బంగాళాఖాతంపై ఏర్పడిన తీవ్ర అల్పపీడనం గత ఆరుగంటల్లో గంటకు 17 కిలోమీటర్ల వేగంతో దాదాపు ఉత్తరం వైపుగా కదులుతోందని.. పేర్కొంది. ఉత్తర వైపు కదులుతూ సాయంత్రం నాటికి తూరు మధ్య కదులుతూ ఆదివారం ఉదయం నాటికి తీవ్ర తుఫానుగా మారి అర్ధరాత్రి సాగర్ ద్వీపం, ఖేపుపరా మధ్య బంగ్లాదేశ్, ఆనుకొని పశ్చిమ బెంగాల్ తీరాలను దాటుతుందని పేర్కొంది.



## భక్తజన సంద్రంగా యాదాద్రి

యాదగిరిగుట్ట,మే25: వేసవి సెలవులు ముగుస్తుండటంతో ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూ కాంప్లెక్స్‌లో నిరీక్షిస్తున్నారు. ధర్మ దర్శనానికి 3 గంటలు.. ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 2 గంటలు సమయం పడుతోంది. కొండకింద ఆధ్యాత్మిక వాడలోని పుష్కరిణి ప్రాంగణం, వాహనాల పార్కింగ్, వ్రత మండపం భక్తులతో కిక్కిరిసిపోయాయి. స్వామివారిని దర్శించుకుని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

# పదేళ్లలో 1,60,083 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ

మేయిన్ పేజీ తరువాయి..

రంగంలో తెలంగాణ అనేక విజయాలు సాధించింది. గత పదేండ్లలో ఇప్పటి దాకా కూడా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఉపాధి కల్పన తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా జరిగింది లేదు. ఈ దశాబ్ద కాలంలో జరిగిన ఉపాధి కల్పన గురించి తెలంగాణ యువతకు చెప్పాల్సిన బాధ్యత మాపై ఉంది. నీళ్లు, నిధులు నియమకాలు ప్రతిపాదికన తెలంగాణ ఉద్యమం జరిగింది. కేసీఆర్ నాయకత్వంలో సాధించిన ప్రగతి, ఉపాధి కల్పన రంగంలో సాధించిన విజయాలను ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాం అని కేటీఆర్ తెలిపారు. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో యధేచ్ఛగా తెలంగాణకు రావాల్సిన ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో తీవ్రమైన వివక్ష, అన్యాయం జరిగింది. దాన్ని నిరసిస్తూ ఎన్నో సందర్భాల్లో కేసీఆర్ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేశారు. హైదరాబాద్‌ను ఫ్రీ జోన్‌గా ప్రకటించడాన్ని నిరసిస్తూ కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేశారు. ఉమ్మడి ఏపీలో రాష్ట్రపతి ఉత్తర్వులను యధేచ్ఛగా, ఇష్టానుసారంగా నాటి ప్రభుత్వాలు తుంగలో తొక్కాయి. ఉత్తర్వులను ఉల్లంఘించాయి. జోనల్ సిస్టమ్‌లో ఉన్న ఓపెన్ కోటాను నాన్ లోకల్ కోటాగా అన్వయిస్తూ.. సమైక్య పాలకులు తెలంగాణ యువతకు తీవ్ర అన్యాయం చేశారు అని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్, బీజేపీ నాయకత్వాన్ని సవాల్ చేస్తున్నాను. అటెండర్ నుంచి గ్రూప్ 1 ఆఫీసర్ దాకా 95 శాతం ఉద్యోగాలు స్థానిక పిల్లలకే ఇచ్చే రాష్ట్రం తెలంగాణ తప్ప మరొకటి ఉన్నదా..? ఒకవేళ ఉంటే తెలంగాణ యువతకు చెప్పాలని బీజేపీ, కాంగ్రెస్ నాయకత్వాన్ని సవాల్ చేస్తున్నా.

ఈ రెండు పార్టీలే 75 ఏండ్లు అధికారంలో ఉన్నాయి. 28రాష్ట్రాల్లో ఆయా పార్టీల ప్రభుత్వాలే అధికారంలో ఉన్నాయి. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రపతి, ప్రధానిని కలిసి కొత్త జోనల్ వ్యవస్థను తెచ్చాం. అటెండర్ నుంచి గ్రూప్–1 ఆఫీసర్ దాకా తెలంగాణ యువతకే ఉద్యోగాలు దక్కేలా 95 శాతం రిజర్వేషన్లు కల్పించాం. ఈ రిజర్వేషన్లు భారతదేశంలో ఎక్కడా లేవు. ఈ విషయాన్ని తెలంగాణ యువత, వారి తల్లిదండ్రులు గమనించాలి. ఇది కేసీఆర్ వల్లే సాధ్యమైంది. నిరుద్యోగుల బాధ, నియామకాల్లో వివక్ష చూసిన తర్వాత 95 శాతం రిజర్వేషన్లు కేసీఆర్ కల్పించారని కేటీఆర్ పేర్కొన్నారు. 2014 నుంచి 2023 డిసెంబర్ దాకా తొమ్మిదిన్నరేండ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంది. మా కంటే ముందు పదేండ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. కాంగ్రెస్ హయాంలో 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఏపీలోని 23 జిల్లాల్లో మొత్తం కలిపి ఏపీపీఎస్సీ ద్వారా, ఇతర సంస్థల ద్వారా 24,086 ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే భర్తీ అయ్యాయి. అందులో తెలంగాణలో వాటా 42 శాతం అనుకుంటే.. తెలంగాణలోని పది జిల్లాలకు దక్కింది 10,080 ఉద్యోగాలు మాత్రమే అని కేటీఆర్ తెలిపారు.కేసీఆర్ హయాంలో 2 లక్షల 32 వేల 308 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చింది. అందులో 2 లక్షల 2 వేల 735 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేశాం. టీఎస్‌పీఎస్సీ ద్వారా 60,918 ఉద్యోగాల భర్తీకి అనుమతిస్తే, 54,015 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. 35,250 ఉద్యోగాలు భర్తీ అయ్యాయి. మరో 18,765 ఉద్యోగాల భర్తీకి పక్రియ కొనసాగుతోంది. పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 50,425 ఉద్యోగాల భర్తీకి అనుమతిస్తే, 48,247 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. 47,068 ఉద్యోగాలు భర్తీ అయ్యాయి. 1179 ఉద్యోగాల భర్తీ పక్రియ కొనసాగుతోంది.గురుకుల రిక్రూట్‌మెంట్ ద్వారా 17,631 ఉద్యోగాలకు అనుమతిస్తే, 12,904 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ కాగా, 3,694 ఉద్యోగాలను భర్తీ చేశాం. 9,210 ఉద్యోగాలు భర్తీ దశలో ఉన్నాయి.

డీఎస్సీ ద్వారా 34,100 ఉద్యోగాలకు అనుమతి ఇస్తే, 28,534 ఉద్యోగాలకు నోటిఫికేసన్లు ఇచ్చాం. 22,892 భర్తీ చేశాం. మరో 5,642 ఉద్యోగాలు భర్తీ దశలో ఉన్నాయి. మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 14,283 ఉద్యోగాలకు అనుమతి ఇస్తే, 9684 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేశాం. భర్తీ చేసింది 2047 ఉద్యోగాలు. మిగతా 7637 ఉద్యోగాలు భర్తీ దశలో ఉన్నాయి. యూనివర్సిటీల కామన్ బోర్డు ద్వారా భర్తీ చేయాల్సిన 105 ఉద్యోగాలకు నాటి గవర్నర్ మోకాలడ్డారు. ఇక ఇతర సంస్థలు అన్ని కలుపుకుంటే 54,846 ఉద్యోగాల భర్తీకి అనుమతిస్తే, 49,351 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేశాం. 49,132 ఉద్యోగాలు భర్తీ చేశాం. మిగిలిన 219 భర్తీ దశలో ఉన్నాయి. మొత్తంగా కేసీఆర్ హయాంలో 2,32,308 పోస్టులకు అనుమతి ఇచ్చారు. 2,02,735 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేశారు. 1,60,083 ఉద్యోగాలు భర్తీ చేశారు. మిగిలిన 42,652 ఉద్యోగాలు భర్తీ దశలో ఉన్నాయని కేటీఆర్ తెలిపారు. జాబ్ క్యాలెండర్ పేరిట కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదు అని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అనేక మోసాలు జరుగుతున్నాయి. 2 లక్షలు ఉద్యోగాలు ఏడాదిలో ఇస్తామన్నారు. ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రూప్–1 కింద 503 పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే.. దాన్ని రద్దు చేసి కొత్తగా 60 పోస్టులు కలిపి మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చారు. దాన్ని కొత్త నోటిఫికేషన్ అంటున్నారు. 50 వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేస్తమన్నాడు. తాము 5,089 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే దాన్ని కూడా రద్దు చేశారు. అయితే 50 వేల ఉద్యోగాలతో డీఎస్సీ నోటిఫికేషన్ వస్తదని అనుకుంటే.. 5,089 పోస్టులకు అదనంగా మరో 5913 కలిపి 11 వేల ఉద్యోగాలతో కొత్త నోటిఫికేషన్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా నోటిఫికేషన్లు ఇచ్చిందేమీ లేదు. ఇవ్వకపోగా 2 లక్షల ఉద్యోగాల మాట తుంగలో తొక్కారు. జాబ్ క్యాలెండర్ అతిగతి లేదు. 4 వేల నిరుద్యోగ భృతి హామీ ఇవ్వలేదని భట్టి విక్రమార్క పచ్చి అబద్ధం చెప్పారు అని కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగాలకు నిర్వహించే రాత పరీక్షలకు రూపాయి కూడా ఫీజు తీసుకోనని రేవంత్ అన్నాడు. టెట్ ఫీజును 400 నుంచి 2 వేలు చేశాడు. ఇది వాస్తవం. ఇంకో దారుణం ఏంటంటే.. మేం కష్టపడి పరిశ్రమలు తెస్తే..వాటిని రేవంత్ పాతరేస్తున్నాడు. ఫార్మా సిటీ పేరిట 12 వేల ఎకరాల్లో ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మా క్లస్టర్ పెట్టి, ప్రత్యక్షంగా, పరోక్షంగా 5 లక్షల ఉద్యోగాల సృష్టికి రంగమంతా సిద్ధం చేస్తే దానిని కూడా రేవంత్ రద్దు చేశారు. ఫార్మా సిటీని పక్కనపెట్టి.. రియల్ ఎస్టేట్ చేస్తానని రేవంత్ రెడ్డి అంటున్నాడని కేటీఆర్ ధ్వజమెత్తారు.

# ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారం

మేయిన్ పేజీ తరువాయి..

ఓటింగ్ జరగనుంది. మొత్తం 4,61,806 మంది పట్టభద్ర ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 287007 మంది, మహిళలు 174794 మంది కాగా ఇతరులు ఐదుగురు ఉన్నారు. మూడు పార్టీలు ఈ స్థానంలో పాగా వేసేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నాయి. తీన్మార్ మల్లన్నను గెలిపించేందుకు కాంగ్రెస్ సర్వశక్తులు ఒడ్డుతోంది. వరంగల్–నల్లగొండ– ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికను గెలవడం కాంగ్రెస్‌కు ఎంత ఆవశ్యకమో.. బీఆర్ఎస్‌కు కూడా అంతే అవసరం. అసలు ఈ ఎన్నిక పల్లా రాజేశ్వరరెడ్డి రాజీనామాతో వచ్చింది కాబట్టి సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవడం బీఆర్ఎస్‌కు ప్రతిష్టాత్మకంగా మారింది. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు గట్టిగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ తరఫున 12 జిల్లాల పరిధిలో పట్టభద్రుల సమావేశాలు నిర్వహించి తీన్మార్ మల్లన్న గెలుపుకోసం మంత్రులు,ఎమ్మెల్యేలు ప్రచారం చేశారు. బీజేపీ తరఫున బరిలోకి దిగిన ప్రేమేందర్ రెడ్డికి మద్దతుగా ఏకంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. ప్రశ్నించే గొంతుకకు పట్టం కట్టాలనే నినాదాన్ని రెండు పార్టీలు అందుకున్నాయి. కోచింగ్ సెంటర్ల నిర్వాహకుడిగా నిరుద్యోగులకు సుపరిచితుడైన పాలకూరి అశోక్ కుమార్, ఇటీవలే కాంగ్రెస్ నుంచి సస్పెన్షన్ కు గురైన బక్క జడ్సన్ ప్రచారం చేశారు. మొత్తానికి ఎవరి వ్యూహాలు వాళ్లకున్నాయి. పెద్దల సభలో పై చేయి సాధించాలని మూడు పార్టీలు పంతం మీదున్నాయి. మరి పట్టభద్రుల తీర్పు ఎటు అన్నది చర్చగా మారింది. ఇకపోతే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ సందర్భంగా 48 గంటలపాటు మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. పోలింగ్ జరగనున్న ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో బంద్ కానున్నాయి. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి మే 27 సోమవారం సాయంత్రం 6 గంటల వరకు వైన్స్ మూసివేయనున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు జరగని ప్రాంతంలో మాత్రం మద్యం దుకాణాలు తీసి ఉంటాయి. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.కాగా మే 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుంచి రాకేశ్ రెడ్డి, బీజేపీ నుంచి ప్రేమేందర్ రెడ్డి బరిలో ఉన్నారు. మరోవైపు జూన్ 4వ తేదీన కూడా తెలంగాణలో మద్యం దుకాణాలు బంద్ కానున్నాయి. ఇదే రోజు ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. మే 27వ తేదీ మంగళవారం రోజున జరిగే పోలింగ్ కోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 8గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానుంది. సాయంత్రం 4గంటల వరకు కొనసాగనుంది. పోలింగ్ రోజు ఉదయం6 నుండి సాయంత్రం 8 వరకు144 సెక్షన్ అమలు ఉంటుంది. ఇక మూడు జిల్లాల్లో మొత్తం 605 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు ఎన్నికల అధికారులు. మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని 34 అసెంబ్లీ నియోజకవర్గాలల్లో మొత్తం 4 లక్షల 61 వేల 806 గ్రాడ్యుయేట్లు ఓటు వేయనున్నారు. అత్యధికంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో లక్షా 73వేల 406 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. ఇక, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షా 23వేల 985 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా.. ఉమ్మడి నల్గొండ జిల్లాలో లక్షా 66వేల 448 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు.

## పదేళ్లలో బిఆర్ఎస్ ఉద్యోగాలు ఇవ్వలేదు

### ఇస్తే నిరుద్యోగులు ఎందుకు ప్రశ్నిస్తారు
### ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారంలో ఈటల విమర్శలు

**ఖమ్మం,మే25:** పదేళ్లలో భారాస ఉద్యోగాలు కల్పించలేకపోయిందని భాజపా నేత ఈటల రాజేందర్ విమర్శించారు. అలా కల్పించివుంటే ఇవాళ నిరుద్యోగులు



ఎందుకు ప్రశ్నిస్తారని అన్నారు. ఉద్యోగాలు కల్పించక పోగా ..ఇచ్చామని చెప్పడం మరింత దారుణమని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇల్లందులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడే ఏమీ చేయని భారాస ఇప్పుడెలా చేస్తుందని ప్రశ్నించారు. నీళ్లు, నిధులు, నియామకాలు పక్కదారి పట్టాయన్నారు. కాంగ్రెస్ డిక్లరేషన్లు, సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం మాత్రమే అమలవుతోందని చెప్పారు. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను మంత్రిగా ఉన్నప్పుడే మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపినట్లు పేర్కొన్నారు. పట్టభద్రులను చిన్నచూపు చూసిన పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఉద్యోగాల నోటిఫికేషన్లు రావడం లేదని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఈటల రాజేందర్ అన్నారు.

# అబద్దాల గ్యారెంటీతో అధికారంలోకి కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి..

ఆరోపించారు. పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి కోసం ఖమ్మం జిల్లాలో రామచంద్రరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దేశంలో బీజేపీ అధికారంలోకి రాకుండా చేయాలని కలిసి పని చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ స్థాయి పెరుగుతోందని, అలా జరిగితే ప్రజల తరపున పోరాడుతుందనే భయంతో రెండు పార్టీలు కలిసి తమపై లేని పోని అబద్ధాలు చెబుతున్నాయని ధ్వజమెత్తారు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి వేసి గెలిపించాలని రామచంద్రరావు కోరారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక జాతీయవాద ఎన్నిక, జాతీయవాద వ్యతిరేక ఎన్నిక అని చెప్పారు. అనేక ఉద్యమాలు చూసిన జిల్లా కాబట్టి ఎవరికి ఓటు వేయాలో మీకు తెలుసునని అన్నారు.రెండు రోజులుగా ఎమ్మెల్సీ ఎన్నికల కోసం బీఆర్ఎస్ నాయకులు ఖమ్మం జిల్లాలో తిరుగుతున్నారన్నారు. బీజేపీ నాయకులు హైదరాబాద్‌ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రాజధానిగా చేసే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపణలు చేస్తున్నారన్నారు. బీజేపీ నాయకులకు ఓటు వేయొద్దని తామే ఉన్నత విద్యావంతులమని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పుకుంటు న్నారన్నారు. ప్రేమేందర్ రెడ్డి 40 సంవత్సరాలు ఒకే సిద్ధాంతం మీద నిలబడి, ఒకే పార్టీలో ఉండి ప్రజల పక్షానా పోరాడుతున్నారని తెలిపారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులు ఎన్ని పార్టీలు మారారో అందరికీ తెలుసునని తెలిపారు. విద్యార్థులను, రైతులను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ధ్వజమెత్తారు.

ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పాపం మొత్తం బీఆర్ఎస్‌దేనని, పాప ప్రక్షాళన చేయాలంటే పట్టభద్రులు ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి గుణపాఠం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే ధర్మారావు పిలుపునిచ్చారు. ఉప ఎన్నికలు కాబట్టి బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలని, ఆయన పట్టభద్రుల తరుఫున పోరాడుతారని చెప్పారు. పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఏర్పాటు చేసింది బీజేపీనేనని స్పష్టం చేశారు. గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని ఆశీర్వదించి ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మండలికి పంపించాలని ధర్మారావు కోరారు.



# కౌంటింగ్ సిబ్బందికి మాస్టర్ ట్రైనర్స్ పూర్తి అవగాహన కల్పించాలి

– జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ జి రవి నాయక్




**మహబూబ్ నగర్ మే 25 ( ప్రజా జ్యోతి బ్యూరో )** ఎంపీ ఎన్నికల ఓట్ల కౌంటింగ్ సిబ్బందికి మాస్టర్ ట్రైనర్స్ పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్ అన్నారు. శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ ఆధ్వర్యంలో కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చే మాస్టర్ ట్రైనర్స్ కు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్ మాట్లాడుతూ సోమవారం నాడు నిర్వహించనున్న కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమంలో పాల్గొనే సిబ్బంది అందరికీ కూడా కౌంటింగ్ ప్రక్రియ పైన పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని తద్వారా జూన్ 4వ తేదీన నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ విజయవంతం చేసే బాధ్యత మీ పైననే ఉంది అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఇతర శిక్షణ అధికారులు బాలు యాదవ్ బైకాని దూకుడు శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గడువులోగా సిఎంఆర్ ఇవ్వని మిల్లర్లు ప్రభుత్వానికి డబ్బులు కట్టాలి

– డబ్బులు కట్టని పక్షంలో ఆస్తులు జప్తు – జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్



**వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 25(ప్రజా జ్యోతి):** రబీ 2020–21,ఖరీఫ్ 2021–22 కు సంబంధించిన సి.యం.ఆర్ ధాన్యం ఎఫ్.సి. ఐ కి నిర్ణీత గడువులోగా ఇవ్వని మిల్లర్లు వెంటనే ప్రభుత్వానికి డబ్బులు కట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ మిల్లర్లను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం ఐ.డి. ఒ.సి సమావేశ మందిరంలో ధాన్యం సేకరణ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రబీ 2020–21,ఖరీఫ్ 2021–22 కు సంబంధించిన సి.యం.ఆర్ ధాన్యం ఎఫ్.సి.ఐ.కు సకాలంలో ఇవ్వనందున తీసుకున్న ధాన్యం కు సంబంధించి ప్రభుత్వానికి డబ్బులు జమ చేయాలని లేని పక్షంలో రెవెన్యూ రికవరి యాక్టు ద్వారా ఆస్తులు జప్తు చేయడం జరుగుతుందని కరాఖండిగా తేల్చి చెప్పారు. 2022–23,2023–24 కు సంబంధించి మిల్లర్ల నుండి ఇవ్వాల్సిన ధాన్యం యుద్ధ ప్రాతపదికన ఎఫ్.సి. ఐ కి అందించాలని సూచించారు. ప్రభుత్వం నుండి వరి ఇచ్చినందున మిల్లు ఆడించి బియ్యం ఇవ్వాల్సిన బాధ్యత మిల్లర్ల పై ఉందని తెలియజేశారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ యం.నగేష్, సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్,డి.యం.సివిల్ సప్లై ప్రవీణ్,మిల్లర్లు, సివిల్ సప్లై సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓటింగ్ లెక్కింపును సజావుగా జరిగేలా చూడాలి

– జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ యం నగేష్



**వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 25(ప్రజా జ్యోతి):** జూన్, 4న నాగర్ కర్నూలు జిల్లాలో జరిగే పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ లెక్కింపును సజావుగా నిర్వహించేందుకు సిబ్బంది తమ బాధ్యతలను జాగ్రత్తగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ యం.నగేష్ ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం ఐ.డి. ఒ.సి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వనపర్తి నియోజకవర్గ కౌంటింగ్ సిబ్బందికి మాస్టర్ ట్రైనర్ ల ద్వారా మొదటి స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణకు హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సిబ్బంది తమ కౌంటింగ్ బాధ్యతలు నిబంధనలకు అనుగుణంగా నిర్వర్తించాలని సూచించారు. కౌంటింగ్ లో సిబ్బంది పాటించాల్సిన నియమాలు,కౌంటింగ్ చేసే విధానం పై మాస్టర్ ట్రైనర్ లు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు. మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ రమేష్ రెడ్డి,



కిషన్ నాయక్ కౌంటింగ్ సిబ్బందికి ప్రొజెక్టర్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ.వి.యం నోడల్ అధికారి పూర్ణాచందర్, టేబుల్ సూపర్వైజర్లు, సహాయకులు, కౌంటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొండల్ యాదవ్ బర్త్‌డేలో

# పాల్గొన్న చేవెళ్ల అసెంబ్లీ ఇంచార్జ్ ఫామేన భీమ్ భారత్

**నవాబుపేట్ మే 25 (1 ప్రజా జ్యోతి)** నవాబుపేట్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొండల్ యాదవ్ శనివారం ఆయన పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. ఆయన పుట్టినరోజుకు చేవెళ్ల అసెంబ్లీ ఇంచార్జ్ పామేన భీమ్ భారత్ హాజరయ్యారు. కొండల్ యాదవ్ స్వగృహమందు నిర్వహించిన పుట్టినరోజుకు హాజరైన పామేనా భీమ్ భారత్ కొండల్ యాదవ్ దంపతులను శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని కుటుంబం ఆయురారోగ్యాలతో ఉండాలని సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆశిర్వదించారు.

## ఆశనొల్ల అశోక్ భౌతిక దేహాన్ని

# పరామర్శించిన చేవెళ్ల అసెంబ్లీ ఇన్చార్జ్ ఫామిలీ భారత్

**నవాబుపేట్ మే 25 (ప్రజా జ్యోతి)** నవాబుపేట్ మండల పరిధిలోని అక్నాపూర్ గ్రామానికి చెందిన ఆశనొల్లా అశోక్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు భీమ్ భారత్ వీరాభిమాని అయినటువంటి అశోక్, శుక్రవారం రాత్రి తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న చేవెళ్ల అసెంబ్లీ ఇంచార్జ్ పామేన భీమ్ భారత్ శనివారం అశోక్ భౌతిక దేహాన్ని పరామర్శించి నివాళు లర్పించారు. వీరితోపాటు నవాబుపేట్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకటయ్య మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు ఆర్థిక సహాయం




**దోమ మే 25 (ప్రజా జ్యోతి) :** మండల పరిధిలోని మోత్కూర్ గ్రామానికి చెందిన రాకొండ రాములు మలేరియా, డెంగ్యూ జ్వరంతో బాధపడుతూ వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మహవీర్ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకొన్న జిల్లా బిసి ఉద్యోగ సంఘాల అధ్యక్షులు రామకృష్ణ ధనేశ్వర్,మోత్కూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్తపేట ఆనంద్,షబ్బీర్,రాఘవేందర్ రెడ్డి,శంకర్ తదితరులు రాములు ను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు వైద్య ఖర్చుల కోసం 6,000 రూపాయలు ఆర్థిక సాయం చేయడం జరిగింది. అదేవిధంగా రాములు వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసానివ్వడం జరిగింది.

# విత్తనాల కొనుగోలు విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు

– హాజరైన వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి డి గోపాల్





**నవాబుపేట్ మే 25 (ప్రజా జ్యోతి)** మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం రైతులకు విత్తనాలు కొనుగోలు విషయంలో అవగాహన కల్పించేందుకు రైతు సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి డి గోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులు విత్తనాలు కొనుగోలు చేసే ముందు విత్తన ప్యాకెట్లు లూజుగా ఉంటే తీసుకోకూడదని పూర్తి ప్యాకెట్టు ఉంటేనే కొనుగోలు చేయాలని తెలిపారు. లూజు విత్తనాలు కొనుగోలు చేస్తే నకిలీ విత్తనాలు వచ్చే ప్రమాదం ఉందని దీని ద్వారా రైతులు నష్టపోతారని తెలిపారు. ఒకవేళ విత్తనాలలో ఏదైనా నకిలీ విత్తనాలు వచ్చిన సమస్యలు వచ్చిన అధికారులకు తెలిపేందుకు రసీదు ఉండాలి. కాబట్టి రైతులు విత్తనాలు కానీ ఎరువులు కానీ కొనే ముందు ఏ దుకాణంలో కొంటారో ఆ దుకాణంలో కచ్చితంగా రసీదు తీసుకోవాలని తెలిపారు. ఎందుకంటే విత్తనాలలో ఏదైనా లోపం సంభవించిన రసీదు దానితోపాటు విత్తనం యొక్క కాళీ ప్యాకెట్ ను కూడా భద్రముగా దాచు కున్నట్లయితే సమస్య వచ్చినప్పుడు వాటి గురించి తెలుసుకోవడానికి సులువుగా ఉంటుందని తెలిపారు. విత్తనాలు ఎక్కడ పడితే అక్కడ కొనకుండా వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన దుకాణంలోనె కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఏ డి ఏ వినోద్, నవాబుపేట్ ఏవో ప్రసన్నలక్ష్మి, నవబుపేట్ మండల ఏ ఈ ఓ లు రమేష్, రమాదేవి, లక్ష్మీ ప్రసన్న, శ్రావణ్ మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వేణుగోపాల స్వామి ఆలయాన్ని
# సందర్శించిన దేవదాయ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్



**పరిగి, మే 25: (ప్రజా జ్యోతి)** పరిగి పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయాన్ని దేవదాయ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ తులసీరామ్ శనివారం సందర్శించారు. పరిగి మున్సిపల్ పరిధిలోని వేణుగోపాల స్వామి ఆలయం పునర్ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ట, భూముల పరిరక్షణ కొరకు ఫిబ్రవరి 16న వికారాబాద్ జిల్లా జేఏసీ చైర్మన్ ముకుంద నాగేశ్వర్ ఆధ్వర్యంలో దేవ దేవదాయ శాఖ కమిషనర్ కు వినతి పత్రం అందించారు. ఈ మేరకు దేవాదాయ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ వేణుగోపాలస్వామి ఆలయాన్ని సందర్శించి ఆలయ అభివృద్ధి కొరకు తగు ప్రతిపాదనలు దేవదాయ శాఖకు సమర్పించి త్వరగా ఆలయ అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా జేఏసీ చైర్మన్ ముకుంద నాగేశ్వరరావు వివిధ పార్టీలకు చెందిన నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బెల్లి లలితక్క యాదిలో



**చేవెళ్ల మే 25(ప్రజా జ్యోతి):** లలితక్క తన పాటలతో సభ ప్రాంగణాన్ని దద్దరిల్లేలా చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ నినాదం కొద్దో గొప్పో చదువుకున్నవారు మాత్రమే చాటుమాటుగా, గుసగుసగా చర్చించుకుంటున్న తరుణంలో మొట్టమొదటి బహిరంగ సభ ద్వారా తెలంగాణ నినాదానికి జీవం పోసి ఉద్యమకారుల్లో ఆశలు చిగురించేలా చేసింది. భువనగిరి సభ మొదలు రాష్ట్రంలలో కాలికి బలపం కట్టుకొని తిరుగుతూ పలు జిల్లాలో ఏర్పాటు చేసిన తెలంగాణ సభలల్లో పాటకు పర్యాయ పదంగా మారింది బెల్లి లలిత. ఉత్పత్తి కులంలో పుట్టిన లలిత సాధారణ జనానికి కూడ అర్థం అయ్యేరీతిలో పాలకులు తమకు చేసే అన్యాయాన్ని విప్పి చెప్పేది. తెలంగాణ జనసభ కార్యక్రమాల్లో పాల్గొంటూనే.. దానికి అనుభందంగా ఉన్న తెలంగాణ కళామండలి రాష్ట్ర కో-కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించింది. పాటే జీవితంగా ఎంచుకున్న లలిత తెలంగాణ పాటకు కేరాఫ్ అయ్యింది. తెలంగాణ మహా సభలో సైతం లలితక్క గళం విప్పింది. ఆ గానానికి అశేషజనం ఫిదా అయ్యి దిక్కులు పిక్కటిల్లేలా జై తెలంగాణ అంటూ గట్టిన నినదించిర్రు. లలితక్క తన పాటలతో లక్షలాదిజనాన్ని ఉత్తేజ పరిచింది. 1998లో జరిగిన తెలంగాణ జన సభ ఇలా ప్రతి చోట స్థలం ఏదైనా గళం లలితక్కదే. ఒక్కమాటలో చెప్పాలంటే.. తెలంగాణ ఉద్యమానికి జవ జీవాలు పోసింది బెల్లి లలితక్క. ఉద్యమపాట లలితను జనం అక్కున చేర్చుకొని, ఉద్యమంలో కాలు కదిపారు. ఈ సభల ద్వారా తెలంగాణ అంతటా లలితకు ఆదరణ లభించింది. తెలంగాణ ప్రజలు ఎంతో ప్రేమగా లేడీ గద్దర్, నైటింగేల్ అఫ్ తెలంగాణ గాన కోకిల అని బిరుదునిచ్చారు. పాటతోనే నాటి ప్రభుత్వ నిర్బంధాలను సవాల్ చేసిన సాంస్కృతిక సేనాని, ప్రాంతీయ అసమానతలను ప్రశ్నిస్తూ.. పాలకులను నిలదీసింది. వారుచేసే ఓట్ల రాజకీయంగుట్టు పాటల రూపంలో విప్పి చెప్పింది. లలిత గజ్జెకట్టి " తెలంగాణ మెలుకొన్నది... బంధనాలు తెంచుకున్నది..." అంటే తెలంగాణ అంతా ఆడింది.

"తెలంగాణ బిడ్డల్లారా..దగపడిన తమ్ముల్లారా..." అంటూ పాడితే తెలంగాణ అంతా ఊగింది. సమస్య ఏదైనా అప్పటికప్పుడు దానిపై కైకట్టి పాడేది. లలితలో ఉండే ఆ అద్భుత శక్తికి తోటి ఉద్యమకారులను కూడ ఆశ్చర్యపోయెవారు. లలిత పాటలు వినడాకికే జనం లక్షల్లో వచ్చేవారంటే ఆ గొంతుకు ఉన్న శక్తి ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. బెల్లి లలిత హత్య : పాట పాటతీరుగా ఉన్నన్ని రోజులు ఏంకాలె, ఎప్పుడైతే పాట అస్తిత్వం కోసం ధిక్కార స్వరం వినిపించిందో రాజ్యం వెన్నులో వణుకు పుట్టింది. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పాటపై నిర్బంధాన్ని అమలుపరిచింది. పాట ప్రశ్నిస్తది, జనాల్ని ఐక్యం చేస్తది. శ్రమ జీవుల గొంతుక అవుతది, ఒక పాట వంద ప్రసంగాలతో సమానం! . ప్రత్యేక తెలంగాణ డిమాండ్ ఉవ్వేత్తున ఎగిసిపడుతుండటంతో నాటి ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా అయ్యింది. అందులోనూ రాష్ట్ర హోం మంత్రి ఇలాఖా అందులోనే భువనగిరి నుంచి లలితకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చే ప్రతిపాదనలు రావడంతో తట్టుకోలేకపోయింది. ఉద్యమ పాట పాలకులకు కంటగింపు అయ్యింది. అందులోనూ లలితక్క స్థాయి అంచెలంచెలుగా పెరిగి రాష్ట్రంలో ఒక శక్తిగా మారి ప్రజలు ఎన్నుకోని ప్రజాప్రతినిధిగా అయ్యింది. ఒక్క గొంతును అంతమొందిస్తే లక్ష గొంతులు మూయెచ్చు అనుకోని కుట్ర పన్నింది ప్రభుత్వం. పాటకు శాశ్వతంగా పాడే కట్టాలనుకున్న రాజ్యం పాటపై కత్తిదూసి కొన్ని శక్తులతో ఆడినందుకు కాళ్లను, పాడినందుకు గాత్రాన్ని, పిడికిలి బిగించి నినదించినందుకు చేతులను ఇలా శరీరాన్ని కర్కశంగా బెల్లి లలితక్కను 26 మే 1999న 17 ముక్కలుగా హత్య చేయించింది . తల్లి తెలంగాణకు కన్నీరు మిగిల్చి, బెల్లి లలిత కుటుంబాన్ని కాకవికలం చేసింది ఆ ముఠా. పాటను ఆపామని కలగన్న పాలకులకు కోట్ల గొంతులలో తెలంగాణ పాట హోరెత్తింది. లలిత నెత్తుటితో తడిసిన నేల నుంచి కొన్ని వేల గొంతుకలు మెలకెత్తినయ్. పాటకు మరణం లేదు, పాట నిరంతరం ప్రవహిస్తుంది. లలితక్క ఇచ్చిన ఉద్యమస్ఫూర్తితో ఉరకలెత్తిన పోరాటం ఎట్టకెలకు తెలంగాణ సాధించేలా చేసింది. లలితక్క రాజకీయ ప్రభంజనం కేవలం మూడేళ్లు 1997 నుంచి 1999 వరకే ఉన్నా అంత తక్కువ కాలంలో క్రూరంగా 17 ముక్కలు చేసేలా కుట్ర పన్నింది అంటే బెల్లి లలితక్క ఆనాటి ప్రభుత్వానికి ఎంత బలమైన ప్రత్యార్థో అర్థం చేసుకోవచ్చు. ఏ పాలకులు అయితే తెలంగాణ గాత్రాన్ని అంతమోందిచారో.. ఆ పాలకులకే తెలంగాణ ఉద్యమ గొంతులు దిక్కైనయ్..!. ఈ కాంగ్రెస్ ప్రభుత్వమైనా ట్యాంక్ బండ్ మీద లలితక్క విగ్రహం ఏర్పాటు చేసి, జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించి ఆ పోరాట వీరత్వాన్ని భవిష్యత్తు తరాలకు అందించాలి. లలితక్క కలలు గన్న సామాజిక, ప్రజాస్వామ్య తెలంగాణ సాకారం దిశగా పాలకులు పరిపాలన కొనసాగించాలి. అప్పుడే అదే అక్కలాంటి అమరులకు నిజమైన నివాళి.

# విత్తనాల కొనుగోలులో రైతులు అప్రమత్తంగా ఉండాలి

– రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన



**చేవెళ్ల మే 25(ప్రజా జ్యోతి):** వాన కాలం పంటలకు గ్రామాలలో రైతులు విత్తనాలు కొనుగోలు చేసే విధి విధానాలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని చేవెళ్ల డివిజన్ సహాయ సంచాలకులు రమాదేవి,వ్యవసాయ అధికారి తులసి నిర్వహించారు. చేవెళ్ల మండలంలోని ఇబ్రహీంపల్లి దేవుని ఎర్రవల్లి గ్రామాలలో వారు విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా రైతులకు విత్తనాల కొనుగోలుపై సలహాలు సూచనలు చేశారు. రైతులు సంచుల్లో ఉన్న రోజు విత్తనాలు కొనుగోలు చేయకూడదని కొనుగోలు చేసిన దుకాణ దారుల నుండి రసీదు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధికృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనాలన్నారు. కొనుగోలు చేసిన విత్తనాల ప్యాకెట్ దుకాణదారు ఇచ్చిన రసీదును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరచాలన్నారు. మొలకెత్తిని నాణ్యతలేని లూజ్ విత్తనాలు కొని రైతులు నష్టపోకూడదని సూచించారు. విత్తనాలు కొనుగోలు విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కే. రమేష్ ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ఆధీకృత డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి

– మండల వ్యవసాయ అధికారి సందీప్ కుమార్

– రైతులకు విత్తనాల కొనుగోలులో అవగాహన సదస్సులు



**యాచారం మే 25 (ప్రజా జ్యోతి):** నకిలీ విత్తనాలను నియంత్రించేందుకు వ్యవసాయ శాఖ అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని మండల వ్యవసాయ అధికారి సందీప్ కుమార్ అన్నారు. రైతులు కల్తీ విత్తనాల నియంత్రణలో నాణ్యమైన విత్తనాల కొనుగోలులో తీసుకోవలసిన జాగ్రత్తలపై గునుగల్ క్లస్టర్ లో గున్గల్, మేడిపల్లి క్లస్టర్ లో కుర్మిద్ద, మాల్ క్లస్టర్ లో నల్లవెల్లిలో శనివారం రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. వ్యవసాయ అధికారి సందీప్ కుమార్ మాట్లాడుతూ గత ఏడాది నకిలీ విత్తనాలతో చాలామంది రైతులు నష్టపోయారని రైతులు విత్తనాలు కొనుగోలులో జాగ్రత్తలు వహించాలని అన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన ఆధీకృత డీలర్ల వద్ద మాత్రమే రైతులు నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని అన్నారు. రైతులు వదులుగా ఉన్న సంచుల్లో విత్తనాలను కొనుగోలు చేయవద్దని కొనుగోలు చేసిన దుకాణాల వద్ద నుంచి తప్పనిసరిగా రసీదును పొందాలని పాకెట్లలోని విత్తనాలను కొనుగోలు చేసినట్లయితే పొందిన రసీదు బిల్లును పంట చేతికొచ్చేవరకు భద్రపరచుకోవాలన్నారు. ఒకవేళ విత్తనాలు కొనుగోలుకు రసీదు ఇవ్వకపోతే నకిలీ విత్తనాల కింద సమాచారం అందించాలన్నారు. నకిలీ విత్తనాల వల్ల రైతులు నష్టపోయినప్పుడు విత్తన చట్టం ద్వారా పరిహారం అందించే అవకాశం ఉందన్నారు. రైతులు నాణ్యమైన విత్తనాల కొనుగోలుతో పంటలో అధిక దిగుబడిని పొందాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

# విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

– వట్పల్లిలో పలు దుకణాలను తనికి చేసిన వ్యవసాయాధికారులు

**వట్పల్లి మే 25(ప్రజాజ్యోతి)** శనివారం దేవునూర్ గ్రామంలో వట్ పల్లి మండల వ్యవసాయ అధికారి మరియు రాయికోడ్ డివిజన్ వ్యవసాయ సంచాలకులు విత్తనాల కొనుగోలు విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి సమావేశం ఏర్పాటు చేశారు.. ఇందులో భాగంగా రైతులు ప్రభుత్వంచే గుర్తింపు పొందిన ఢీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి.. మరియు కచ్చితంగా రశీదు పొందాలి అని తెలియజేయడం జరిగింది. అనంతరం వట్ పల్లి లోని పలు దుకణాలను తనికి చేయడం జరిగింది. రిజిస్టర్లు రోజు వారీగా నమోదు చేయాలని, రైతులకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలి లేనియెడల చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ మరియు ఎంఎవోతో పాటు ఎఈఓ మౌనిక మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు..



# పశు సంపదను కాపాడండి

– పశువైద్య అధికారులు డాక్టర్లు చెంద్రశేకర్ రెడ్డి,స్రవంతి

**షాబాద్ ప్రజా జ్యోతి(25.05. 2024).**,చిటుక వ్యాధి ప్రమాధాకరం తొలకరి చినుకలకు మొలిచిన గడ్డి ఎండకు మాడిపోయిన గడ్డి పశువులు తినడం ద్వారా చిటుక వ్యాధి వస్తుంది చిటుక వ్యాధి నివారణ టీకాలు తప్పని సరిగా తీపించాలి డాక్టర్ లు స్రవంతి, చెంద్ర శేకర్ రెడ్డి పశువులలో గొంతువాపు, జబ్బవాపు, వ్యాధి నివారణ టీకాలు, జీవాలలో చిటుక వ్యాధి నివారణ టీకాలు తీయడం జరిగింది.పశుసంపదను కాపాడుకునేందుకు రైతులు వాటికి వ్యాధులు రాకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని రేగడి దోసాడ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి.



స్రవంతి పేర్కొన్నారు శెనివారం షాబాద్ మండలంలోని రుద్రారం, తిమారెడ్డి గూడ కేసారం గ్రామాలలో పశువులలో గొంతువాపు, జబ్బవాపు, వ్యాధి నివారణ టీకాలు, జీవాలలో చిటుక వ్యాధి 8నివారణ టీకాలు తీయడం జరిగింది . ఈ సందర్భంగా డాక్టర్ లు మాట్లాడుతూ గొర్రెలకు, మేకలకు చిట్టుక వ్యాధి రాకుండా టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని రైతులకు సూచించారు గొర్రెలు మేకలు అనారోగ్యానికి గురి కాకుండా ప్రభుత్వం ఏడాదికి ఒకసారి చిట్టుక వ్యాధి నివారణ టీకాలు చేసే కార్యక్రమం నిర్వహిస్తుంది అన్నారు రైతులకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..